# కాదంటే ఔనంటేనా?

**'శమైతాంగి'**

**"మీ కోసం** ఎవరో వచ్చారండీ." అప్పుడే ఆఫీసునుంచి వచ్చిన భర్తకు కాఫీ గ్లాసు అందిస్తూ చెప్పింది సుమిత్ర.

"ఆడవాళ్ళా, మగవాళ్ళా?" భార్యవైపు కొంటెగా చూస్తూ అడిగాడు శ్రీహరి.

"ఒక ఆడ, ఒక మగ." అదే కొంటెతనంతో జవాబిచ్చిందామె.

"భార్యా, భర్తా? లేక అన్నా, చెల్లెలా? ఎవరట్వా వాళ్ళు?" అతను భృకుటి ముడివేసి ఆలోచనా నిమగ్నుడయ్యాడు.

అతని కీమధ్యనే ఆఫీసరుగా ప్రమోషన్ వచ్చింది. అప్పటినుంచి అతనికి ఇంటా, బయటా కూడా యాతన పెరిగింది.

ఆఫీసులో ఉంటే ఎవరో ఒకరు రికమెండేషన్ లెటరుతో సిద్ధం అవుతారు.

"రామయ్యగారు మిమ్మల్ని కలుసుకుని ఈ లెటర్ చూపించమన్నారు, సార్. ఎలాగైనా ఈ పని మీవల్ల కావాలి, సార్" అంటారు.

"నా ప్రమోషన్ గురించి ఏం చేశారు?" అని అడుగుతారు మరొకరు.

"మీ ఆఫీసులో టైపిస్టు పోస్టు ఖాళీగా ఉందటకదూ? మావాడొకడు ఉన్నాడోయ్. అది వాడికి ఇప్పిద్దూ? నీ పేరు చెప్పుకుని బ్రతుకుతాడు" అంటారు రోడ్డుమీద ఆపి మరొకరు.

ఇక ఇంటికి వస్తే "మీకోసం ఎవరో వచ్చా"రని, "ఇవి ఇచ్చి వెళ్ళా"రని పళ్ళు, పూలు చూపించేది సుమిత్ర.

"వాటినెందుకు తీసుకున్నావు? ఈసారి ఎవరన్నా వచ్చి ఏమైనా ఇస్తే తీసుకోవద్దు" అని గట్టిగా మందలించే సరికి సుమిత్ర ఎవరేమిచ్చినా వద్దని తిరస్కరించేది. అతను ఇంట్లో ఉన్నా ఎవరో ఒకరు వచ్చి "నా విషయం ఏం చేశారు, సార్" అని అడగడం మానలేదు. 'ఆఫీసర్‌గా ప్రమోషన్ రాకపోయినా నాకు మనశ్శాంతిగా ఉండేది' అని అతను అప్పుడప్పుడు అనుకోకపోలేదు. తన ప్రాణం ఇదివరకే సుఖంగా ఉండేది. ఈ ప్రమోషన్ ఏ క్షణంలో వచ్చిందో కాని తనకు బాధ్యత పెరగడమే కాక యాతనగా కూడా ఉంది అనుకుంటున్నాడిప్పుడు. తన కోసం ఎవరో వచ్చారనగానే అతని గుండెలో రైళ్ళు పరుగెత్త సాగాయి. అందులోనూ ఒక్కరు కాకుండా ఇద్దరు. అదీ ఒక ఆడ, ఒక మగ వచ్చారంటే అర్థం? తప్పకుండా ఉద్యోగార్థమే వచ్చి ఉంటారు అని కూడా స్ఫురించిందతనికి.

చెల్లెలి కోసం అన్న వచ్చాడో, భార్య గురించి భర్త వచ్చాడో, లేక కూతురు గురించి తండ్రి వచ్చాడో? ఇలా రకరకాలుగా ఆలోచిస్తూనే వేడెక్కి పోతున్నది అతని మస్తిష్కం.

"ముందు కాఫీ తాగండి. చల్లారిపోతే చవి ఉండదు—ఆలోచనలు తరవాత." భర్తను హెచ్చరించి లోపలికి వెళ్ళిపోయింది సుమిత్ర. అప్పటికే వేడి తగ్గి గోరువెచ్చలోకి జారిపోయిన కాఫీని రెండు గుక్కల్లో తాగేసి గ్లాసు కింద పెట్టాడు. గ్లాసు తీసుకు వెళ్ళడానికి వచ్చింది సుమిత్ర.

"ఆమెకెంత వయసు ఉంటుందో చెప్పగలవా?" హఠాత్తుగా అడిగాడు.

"ఎందుకు చెప్పలేమూ? మహచక్కగా చెప్పగలను." పెంకిగా నవ్విందామె. చెప్పు అన్నట్లు చూశాడతను.

"ఆమెకు సుమారుగా నా వయసే ఉంటుందేమో? లేదా ఒకటో, రెండేళ్ళు పెద్దది కావచ్చు. మరిచి పోయాను—వాళ్ళతో రెండేళ్ళ బాబు కూడా ఉన్నాడు. ఆ బాబు ఎంత ముద్దుగా ఉన్నాడనుకున్నారు! వాడిని క్షణం కూడా వదల బుద్ధి కాలేదంటే నమ్మండి నాకు."

"మరి అతనికి?"

"అరవై, లేదా డెబ్బై ఉండవచ్చు. మీకు అనుమానం ఎందుకు వచ్చిందీ?" సాగదీస్తూ చెప్పింది సుమిత్ర.

"వూరికే అడిగానులే." అతను మవునంగా ఉండి పోయాడు. కాని, అతని మనసు ఆలోచిస్తూనే ఉంది. అయితే వాళ్ళు తప్పకుండా తండ్రీ కూతుళ్ళు కావాలి. వెంబడి ఒక బిడ్డ ఉన్నాడంటే, ఆవిడ వితంతువు అయినా కావాలి. లేదా భర్త చేత పరిత్యజించబడినదైనా కావాలి. వాళ్ళు ఎందుకు వచ్చినట్లు? ఇంకెందుకు వస్తారు? ఆఫీసులో క్లర్కు, టైపిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నవని తెలిసి వచ్చి ఉంటారు. లేదా భర్తకు రావలసిన డబ్బు కోసం వచ్చారేమో? ఏమైనా వాళ్ళను చూడకపోతే ఈ కంగారు దేనికి? ప్రశ్న, సమాధానం కూడా తానే చెప్పుకున్నాడు.

ఒక గంట తరవాత సుమిత్ర భోజనానికి పిలిచింది. అతను భోజనం చేసి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని ఆ రోజు పేపరు తిరగేస్తూంటే వీధి వాకిట్లో చప్పుడయింది.

"అమ్మాయ్, బాబు వచ్చారా?" అని అడగడం సుమిత్ర—"వచ్చారు, రండి" అని నవ్విన వాళ్ళని లోపలికి ఆహ్వానించడం అతనికి వినిపిస్తూనే ఉంది. అతను లేవాలి అనుకుంటూ ఉండగానే వాళ్ళు సరాసరి ఆ గదిలోకి వచ్చారు. నమస్తే "నమస్కారం బాబూ" అన్నాడు పెద్దాయన. అతని వెనకాల నిలుచున్న ఆమె స్పష్టంగా కనిపించకపోయినా, ఆమె కట్టుకున్న చీర చెంగు కనిపించింది.

"మీరు . . ." అంటూ అతనివైపు చిరాకుగా చూసిన శ్రీహరి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. ఆ పెద్దాయన్ని గుర్తుపట్టినట్లు అతని కళ్ళు రెపరెప కొట్టుకున్నవి. ఆ కళ్ళలో కోపం, అసహనం, అసహ్యం చోటు చేసుకోగా, "ఎందుకు వచ్చినట్లు" అనే నిర్లక్ష్య భావంతో ఏహ్యంగా చూశాడతను. ఆ వృద్ధుని చూడగానే అతని వెనకాల ఉన్న ఆమె ఎవరో అతనికి తెలిసిపోయింది.

వీళ్ళా? వీళ్ళ గురించా భార్య అంత శ్రద్ధగా చెప్పింది? అసలు వీళ్ళెందుకు వచ్చినట్లు? అంత డబ్బు ఉన్న ఇంటివారి కోడలైన ఈమెకు ఆఫీసుల చుట్టూ తిరగవలసిన అవసరం ఎందుకు వచ్చింది? ఇలాంటి ప్రశ్నలు ఎన్నో అతని మనసును కలచి వేస్తూండగా ఆలోచనలను దూరంగా తరిమి, మొహం మీదికి చిరునవ్వు ఎరువు తెచ్చుకుని, నవ్వు నటిస్తూ "రండి . . .రండి, ఇలా కూర్చోండి" అన్నాడు.

వృద్ధుడు కూర్చుని, 'అమ్మయ్య!' అనుకున్నాడు. ఇక్కడ కూర్చోవడానికి కుర్చీ దొరికిందంటే, ఇక తాము వచ్చిన పని దిగ్విజయంగా అవుతుందనే నమ్మకం కలిగింది.

"మనది ఏ వూరు, బాబూ? అసలు మీది ఏ ప్రాంతంలోను?" అతను వచ్చిన పని చెప్పకుండా ముందు అతని యోగక్షేమాలు విచారించసాగాడు.

"మాది ఏలూరు దగ్గిర చిన్న పల్లెటూరు. బహుశా మీకు తెలిసే ఉండవచ్చు—మా నాన్నగారి పేరు రంగనాథగారు." శ్రీహరి కుర్చీలో వెనక్కు చేరబడి కూర్చుని వచ్చిన ఆమెను చూడసాగాడు.

ఆమె తెల్లగా, పాలిపోయినట్లుగా ఉంది. బహుశా మనసులో బాధలున్నా, కావచ్చు. సన్నగా

పొడవుగా ఉంది. జడ వేసి చిన్న ముడి చుట్టు కుంది. లేత రంగులో వాయిల్ చీర కట్టుకుంది. మెడలో సన్నటి గొలుసు, చెవులకు చిన్న దుద్దులు, చేతులకు రెండేసి బంగారు గాజులు. ఇదీ ఆమె ఆకారం. ఆమెలో ఒకానొకనాడు తనకు వచ్చి, తనను ఆకర్షించుకున్న రూపాన్ని వూహించుకో సాగాడు శ్రీహరి.

కొన్ని సంవత్సరాల క్రితం. అప్పుడు శ్రీహరి బి. ఎ. పాసయి ఖాళీగా తిరుగుతున్న రోజులు. "మీ అబ్బాయి పెళ్ళికి ఎదిగాడు. ఇంకా పెళ్ళి చేయాలనుకోవడం లేదా?" అని తెలిసినవారు, బంధువులు రంగరాజుగారిని అడిగేవారు.

ఇంకా చూడటం లేదంటే ఏమంటారో అని, "నేనూ చూస్తూనే ఉన్నాను, మంచి పిల్లకోసం ఏదీ కుదరడం లేదు మరి. అయినా కళ్యాణయోగం వస్తే ఏదీ ఆగదు కదండీ?" అని ఎంతో నైపుణ్యంతో సమాధానం చెప్పేవారు రంగరాజు గారు. నిజానికాయన ఇంతవరకూ ఏ పిల్లనూ చూడలేదు కొడుకుకోసం. నిలకడ లేని కొడుక్కి పెళ్ళి చేస్తే ఎటు తిరిగి ఏం జరుగుతుందో అని ఆయన భయం. ఒక ఆధారమంటూ ఏర్పడి, కొడుకు జీవితానికి స్థిరత్వమంటూ ఉంటే అప్పుడు పెళ్ళి ప్రయత్నాలు చేయవచ్చని ఆయన ఉద్దేశం. కాని, ఆయన్ని అలా ఉండనివ్వడం లేదు ఎవరూను.

"మా బంధువుల అమ్మాయి ఉం"దని ఒకరు, "మా తమ్ముడిగారమ్మాయి ఉం"దని ఒకరు, "మా చెల్లెలి కూతురు ఉం"దని ఒకరు—ఇలా ఎవరో ఒకరు ఆయన దగ్గరికి కబురు తెచ్చేవారు. అందరికీ "అలాగే చూద్దాం" అనే సమాధానం చెప్పేవారు.

అప్పుడే ఒకతను వచ్చాడు. "పిల్ల చాలా బాగుంటుంది, అయ్యగారూ. ఒక్కర్తే పిల్ల. కావలసినంత కట్నం ఇస్తారు. అబ్బాయి ఉద్యోగం కూడా వారే చూసుకుంటారు. మీరు ఒక్కసారి వచ్చి పిల్లను చూడండి, చాలు" అంటూ పట్టు పట్టుకు కూర్చున్నాడు.

"తిథి, వారం, నక్షత్రం చూసుకుని వస్తా మయ్యా" అన్నా విన్నాడు కాదు, ఒకటే పట్టు. "పోనీ, ఒకసారి వెళ్ళి పిల్లను చూసి వస్తే ఏం పోయింది?" అని భార్య కూడా వంత పాడేసరికి ఇక పిల్ల చూపులకు బయలుదేరక తప్పింది కాదు. వెళ్ళి రావడం, శ్రమే మిగులుతుందని, కొడుక్కి ఏ పిల్లా నచ్చదని ఆయనకు తెలుసు. ఎందుకంటే, కొడుకు ఒక అమ్మాయిని ప్రేమించడం, ఆ అమ్మాయి తల్లి తండ్రులకు ఈ విషయం తెలిసి ఆ అమ్మాయిని కాలేజీ మానిపించి వెంటనే పెళ్ళి చేసి అత్తవారి ఇంటికి పంపేసి 'అమ్మయ్య!' అని సంతృప్తి పడడం జరిగింది. కాని, ప్రేమించిన అమ్మాయిని మరిచిపోలేక, చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేసి, తిండి, నిద్ర నిష్కరించి మతి పోయిన వాడిలా తిరుగుతున్న కొడుకును చూసి ఆ తండ్రి చాలా బాధపడ్డాడు. ప్రేమించిన అందరూ పెళ్ళి చేసుకోలేరు. ఎవరో అదృష్టవంతులకు ఆ యోగం లభిస్తుంది. అలా అని తను ప్రేమించిన



అమ్మాయి తనకు దక్కలేదని ఇలా భవిష్యత్తును నాశనం చేసుకునే మూర్ఖులు ఉంటారా? అనే కోపంలో కొడుకును బాగా చీవాట్లు వేశారు. అలా కేక లేస్తే మనసు మార్చుకుని దారిలో పడతాడేమో కొడుకు అని ఆ తండ్రి ఆశ.

వయసులో, మంచి పరువంలో ఉన్న శ్రీహరికి తండ్రి మాటలు ఏమీ రుచించలేదు. పైపెచ్చు ఎంతో కోపొచ్చి, కసిని ప్రదర్శించాడు. అంతే. తండ్రి పెట్టెలో డబ్బు కొంత చేజిక్కించుకుని వెళ్ళిపోయాడు, బయటి ప్రపంచంలోకి.

తండ్రి ఎన్నోపాట్లు, ఎంతో డబ్బు ఖర్చుపెట్టి వెతికించగా, ఒక హోటల్లో సప్లయర్‌గా దొరికాడు. కొడుకు హీనస్థితిని చూసి ఆ తండ్రి కడుపు చెరువైపోయింది.

( తరువాయి 42 పేజీలో )




# కాదంటే పోయేదా?

( 39-వ పేజీ తరువాయి)

"నీ కిదేం ఖర్మ, నాయనా! ఇంటికి రా. నీ ఇష్టం వచ్చినట్లే ఉండు. ఏమైనా అనను" అని బతిమాలి, బామాలి కొడుకును ఇంటికి తీసుకుని వచ్చారు. రోజులు గడుస్తున్నాయి. శ్రీహరి ప్రేమికురాలిని పూర్తిగా మరిచిపోయాడు. మధ్యలో ఆగి పోయిన చదువును కంటిన్యూ చేశాడు. డిగ్రీ తెచ్చుకున్నాడు ఈమధ్యే.

పెళ్ళికూడా చేసేస్తే, బాధ్యతలు మీద పడితే వాడే కుదురుగా ఉంటాడు అనే ఉద్దేశంతో కొడుకు దగ్గర ఆ ప్రస్తావన తెస్తే ఒకటి, రెండు సార్లు అతను అయిష్టంగా తలవూపాడు. అందుకే, 'ఈ సంబంధం కొడుక్కి నచ్చుతుందో, లేదో' అని మనసులో భయం.

మధ్యవర్తి బాధ పడలేక అమ్మాయిని చూడ టానికి బయలుదేరాడు, కొడుకును ఎలాగో ఒప్పించి.

అమ్మాయి తరఫు వాళ్ళు వీళ్ళను ఎంతో గౌర వంగా చూశారు.

అమ్మాయిని తీసుకువచ్చి శ్రీహరి ఎదురుగా నిలబెట్టారు. ఆ అమ్మాయి నచ్చింది శ్రీహరికి బాగా. "మీ ఇష్టమే నా ఇష్టం, నాన్నా" అన్నాడు మనస్ఫూర్తిగానే.

కొడుకు దగ్గరినుంచి అటువంటి జవాబు వస్తుందని ఊహించని రంగరాజుగారు చాలా ఆనందపడి పోయారు. ఇప్పటికి కొడుకు మనసు మార్చుకున్నందుకు ఆయన చాలా తృప్తి పడ్డారు. ఈ సంగతి వాళ్ళకు తెలియజేశారు— "మా అమ్మాయి మా అబ్బాయికి నచ్చింది. కట్నాల ప్రసక్తి లేదు. ఏమైనా ఇస్తే మీ అమ్మాయికే ఇచ్చుకోండి. మంచి రోజు చూసి [illegible] ముహూర్తం పెట్టించడానికి వస్తాను" అని.

నాలుగు రోజులు గడిచిపోయాయి. ఐదవ రోజున వేలాడేసిన ముఖంతో గుమ్మంలో అడుగు పెట్టాడు మధ్యవర్తి.

"ఏమిటి సంగతులు? మంచి రోజు ఎప్పుడని చెప్పారు?" ఎంతో ఆతృతగా అడిగారు రంగరాజు గారు, మధ్యవర్తిని.

"క్షమించండయ్యా మీ సంబంధం వదులు కున్నామని చెప్పమన్నారు అమ్మాయి తండ్రిగారు.

"ఈ వూళ్ళోనే ఎవరో చెప్పారట మీ అబ్బాయి గుణం మంచిది కాదని. ఎవరో అమ్మాయిని ప్రేమించాడని, చదువు మానేసి దేశ దిమ్మరిలా తిరిగాడని, ఎన్నో వ్యసనాలు ఉన్నాయని చెప్పా రట. 'చూస్తూ చూస్తూ నా కూతురికి అటువంటి సంబంధం ఎలా చేయనయ్యా? దాని గొంతు కోయడం నా కిష్టం లేదు. వాళ్ళను మానుకోమని చెప్పండి' అని మాతో కబురు చేశారు. వేయి అబద్ధాలాడైనా ఒక్క పెళ్ళి చేయమన్నారు పెద్దలు. మరి ఇందులో నిజం ఎంత ఉందో, అబద్ధం ఎంత ఉందో ఆ భగవంతుడికీ, మీకూ తెలియాలి. వస్తాను, సార్" అంటూ చావు కబురు చల్లగా చెప్పి వెళ్ళిపోయాడు మధ్యవర్తి.

ఆ కబురు విన్న రంగరాజుగారు [illegible] పోయారు. ఈ విషయం కొడుక్కి

తెలియనీయకూడదని అనుకున్నారు కాని, పక్క గదిలో మంచంమీద పడుకుని నిద్ర నటించిన కొడుకు పార్వతి చెప్పిన మాటలన్నీ విన్నాడని ఆయనకు తెలియదు, పాపం.

"ఆ పిల్ల ప్రవర్తన మంచిది కాదటరా, అబ్బాయి. చూస్తూ చూస్తూ అటువంటి పిల్లను ఇంటి కోడలుగా ఎలా తెచ్చుకోగలం? అందుకే మరో సంబంధం చూస్తున్నా" అన్నారు కొడుకుతో.

తండ్రి తన మనసు ఎక్కడ నొచ్చుకుంటుందో అని అన్నీ అబద్ధాలు చెప్పినట్లు అతనికి తెలుసు. అయినా, తండ్రిని బాధపెట్టడం ఇష్టంలేక, "అలాగే చూద్దురు గాని, నా కేదైనా ఉద్యోగం దొరికిన తరవాత" అన్నాడు ఔదార్యంగా.

కాని, శ్రీహరి మనసు మండే కొలిమిలా ఉంది. 'అప్పుడు ప్రేమించిన అమ్మాయిని దక్కించుకో లేకపోయాడు. ఇప్పుడు ఇష్టపడిన అమ్మాయిని దక్కించుకోలేకపోయాడు. తనెంత దురదృష్ట వంతుడు! ఇందుకు తన ప్రవర్తనే కారణంకదా?' అని లోలోపల అమితంగా ఖేదపడ్డాడు.

'తనకు నచ్చిన ఆ అమ్మాయి తన వూరికే మరొకరి ఇంటికి కోడలుగా వచ్చింది. ఆ ఇంటి యజమాని చాలామంది పెళ్ళిళ్ళు ఏదో ఒక కారణంగా చెడగొట్టుతూ వచ్చినవాడే. ఒకరికి కుదిరిన సంబంధం చెడగొట్టి మరొకరికి చేయడం, పీటలమీద పెళ్ళిళ్ళు చెడగొట్టడం అతనికి బాగా అలవాటు. తనకు కుదిర్చిన సంబంధమూ అలాగే చెడగొట్టి తన కొడుక్కు చేసుకున్నాడు. పోనీ, వాళ్ళను సుఖంగా బ్రతకనీ!' అనుకున్నాడు శ్రీహరి, వైరాగ్యంగా.

అది జరిగాక వూరినుంచి మకాం ఎత్తి, మరో వూరు వచ్చేశారు రంగరాజుగారు సకుటుంబంగా.

ఉద్యోగం దొరికాక తండ్రికి ఇచ్చిన మాట ప్రకారం పెళ్ళి చేసుకున్నాడు శ్రీహరి. పట్టణంలో చెప్పులన్నీ కట్టి పనయి, ప్రమోషన్ల మీద ఇప్పటికి ఆఫీసర్ రాంకులోకి వచ్చాడు.

ఇప్పుడు తన ఆఫీసుకొచ్చి తన దగ్గరికి వచ్చారు వీళ్ళు. కాదు, విధి రప్పించింది. ఒక్కసారి గతమంతా తిరగేసుకున్న శ్రీహరి వూపిరి తీసుకున్నాడు, బలంగా.

"రంగరాజుగారా? అవును. ఈ పేరు ఎప్పుడో, ఎక్కడో విన్నట్లుగా ఉంది, నాయనా. మీ నాన్న గారు బాగున్నారా?" అలా అడక్కపోతే బాగుండదని కాబోలు, మనిషి గుర్తు లేకపోయినా అడిగాడు ఆ వృద్ధుడు.

"లేరు. ఈమధ్యే పోయారు. ఆయనకంటే ముందు అమ్మ పోయింది." బరువుగా వెలువడ్డాయి శ్రీహరినుంచి మాటలు.

'పాపం, అలాగా!' అన్నట్లు సానుభూతిగా చూశాడు వృద్ధుడు.

'ఇతను నన్ను గుర్తుపట్టలేదు. అదీ మంచి దేలే' అనుకున్న శ్రీహరి, కోపాన్ని నిగ్రహించుకుని, "మీరు వచ్చిన పని...నాతో ఏమైనా పని ఉందా?" అని అడిగాడు.

"అవును, బాబూ. మీ ఆఫీసులో ఒక టైపిస్టు పోస్టు ఖాళీగా ఉందని తెలిసింది.

"ఇది మా అమ్మాయి. దీని భర్త ఒక ఏక్సిడెంటులో పోయాడు. దీని కర్మానికి ఒక బిడ్డ కూడా ఉన్నాడు. భర్త పోయాక చదివించాను. ఇంటర్ పాసయింది. టైపు లోయరు, హయ్యరు కూడా పాసయింది. మొగుడు పోయిన ఆడది అనే సానుభూతితో మీరు ప్రయత్నించారంటే ఆ ఉద్యోగం వస్తుంది. ఆ కొడుకును పెట్టుకుని, చారెడు మెతుకులు సంపాదించుకుని తింటుంది, మీ పేరు చెప్పుకుని. అది ఇదివరకే ఎవరికో ఇచ్చేసినట్లయితే మేము వెళ్ళిపోతాము, బాబూ. ఏమంటావు? చెప్పడం నా వంతు, చేయడం మీ దయా ధర్మంమీద, ఇష్టాయిష్టాలమీద ఆధారపడి ఉంది."

'ఆ వృద్ధు డన్నట్లు ఖాళీ ఉన్న మాట నిజమే. ఒక్క పోస్టుకు వందలమీద వచ్చాయి అప్లికేషన్లు. అన్నీ డిగ్రీలు,పోస్టు—గ్రాడ్యుయేట్లవీను. అందరివీ కాదని ఈమె కెలా ఇవ్వనూ? ఇస్తే నా పేరుకు ఎంత మచ్చ వస్తుందో !

'పాపం, అది ! అందులోనూ భర్త పోయి, బిడ్డతో మిగిలిపోయిన నిర్భాగ్యురాలు. నువ్వు ప్రయత్నిస్తే ఆ పోస్టు ఈమెకు తప్పకుండా వస్తుంది.' మనసు మెత్తబడుతున్నది. 'కాని, ఒకా నొకనాడు వీళ్ళు తనను "మంచివాడు కాడు" అనే చెప్పుడు మాటలు విని తిరస్కరించారు. అందులో నిజానిజాలు ఎంతో అని విచారించలేకపోయారు. అటువంటి వీళ్ళకా సహాయం చేయడం? హాం!' కసి తెప్పగొట్టుతున్నది—'వాళ్ళకు ఏమీ చేయనక్క, పొమ్మను' అని.

అతను ఆలోచిస్తున్నాడు, ఏం చేయాలి అని. ఆమె తన ఆఫీసులో తిరుగుతూంటే తన కోపం రాజుకుంటూనే ఉంటుంది. కనక ఆమెకు ఆ ఉద్యోగం వచ్చేటట్లు ప్రయత్నించడమా, లేక తను మరొక చోటికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోవడమా?

చివరికి మానవత్వమే నెగ్గింది. 'ఆ ఉద్యోగం ఆమెకు వచ్చేలాగే చేస్తాను' అనుకున్న శ్రీహరి, "సర్టిఫికెట్లు వగైరా తెచ్చారా మీరు?" అని అడిగాడు.

"వెంట తెచ్చాను కాని, ప్రస్తుతం మా దగ్గర లేవు. అక్కడ రూములో ఉన్నవి. తెమ్మంటే రేపు తెస్తాము." ఆమె చాలా మృదువుగా చెప్పింది.

"సరే, అలాగే తీసుకురండి. ఆ పోస్టు మీకు వచ్చేలా చేస్తాను" అన్నాడు.

వాళ్ళు లేచి అతని దగ్గర సెలవు తీసుకున్నారు. వెళ్ళడానికి ఉద్యుక్తులౌతూంటే సుమిత్ర వచ్చింది.

"అప్పుడే వెళ్ళుతున్నారా?" అంది.

"రేపు ఉదయం వస్తామండీ." ఆమె జవాబిచ్చింది.

"వచ్చేటప్పుడు బాబునుకూడా తీసుకురండి." చెప్పింది సుమిత్ర.

'అలాగే' అన్నట్లు తల వూపి బయట పడ్డారు.

"ఆమె చాలా అందంగా ఉంది కదూ?" వాళ్ళు వెళ్ళిపోయాక అంది సుమిత్ర.

"ఉందేమో! నేను సరిగ్గా గమనించలేదు. కాని, నీకు అందంగా కనిపించిన ఆమె ప్రతి వాడికి అందంగా ఉంటుందనుకోవడం సరి కాదు, సుమీ" అన్నా డతను పేపరులోకి తల దూరుస్తూ.

"పాపం! అంత చిన్న వయసులోనే భర్త పోవడం, నూరేళ్ళ సౌభాగ్యాన్ని పోగొట్టుకోవడం ఆమె దురదృష్టం. ఆమె వయసులో పెళ్ళి కానివారు ఎంతమందో ఉన్నారు." సుమిత్ర భర్త వైపు చూస్తూ అంది తన మాటకు భర్త కూడా ఆమె పట్ల సానుభూతి చూపిస్తాడని. కాని, పేపరు పఠనంలో మునిగి పోయిన శ్రీహరి భార్య మాటల్ని వినిపించుకోనట్లు ఉండిపోయాడు.

భర్త నుంచి ఎట్టి సమాధానం రాకపోయేసరికి ఆమెకు చాలా ఆశాభంగం అనిపించింది. మరి అక్కడ ఆగకుండా ఎవరో తరుముకొస్తున్నట్లు అక్కడి నుంచి గబగబ వెళ్ళిపోయింది సుమిత్ర.

'ఈ ఆడవారు—అనుమానం, అసూయ ముందు పుట్టి తరవాత వాళ్ళు పుట్టారు' అనుకున్నాడు శ్రీహరి.

ఆ మరునాడు వాళ్ళకోసం ఎదురు చూస్తూంటే, "మీ కిమ్మని ఈ కవరు ఇచ్చి వెళ్ళారు ఒకరు"

---

**విధేయత**

**విధేయత ఎవరికైనా పెట్టని సొమ్ము, చెరగని అలంకారం.**

— లోవెల్

---

అంటూ ఇంటివారి అమ్మాయి ఒక కవరు తెచ్చి ఇచ్చింది.

ఆత్రంగా దాన్ని తెరిచి చూశాడు శ్రీహరి.

"మీ సహృదయానికి ధన్యవాదాలు. కాని, మీ దగ్గర జాబ్ చేయడం నా కిష్టం లేదు. ఎందుకో మీ రీ పాటికి తెలుసుకొనే ఉంటారు. మిమ్మల్ని నేను గుర్తు పట్టాను.

"ప్రతి ఆడపిల్లా తన భర్త మంచివాడై, మంచి అలవాట్లున్నవాడై ఉండాలని కోరుకోవడం అసహజ మేమీ కాదు కదా? నేనుకూడా అందరు ఆడపిల్లల్లాగనే నా భర్త అందగాడు, గుణవంతుడు అయి ఉండాలని కోరుకున్నాను.

"మిమ్మల్ని చూడగానే ఇష్టపడ్డాను. కాని, మీ గుణం మంచిది కాదని, ఎవరినో ప్రేమించి ఆ ప్రేమను మరిచిపోలేక ఇంకా బాధ పడుతున్నారని, మీది నిలకడలేని మనస్తత్వమని తెలియగానే మిమ్మల్ని చాలా అసహ్యించుకున్నాను.

"ముందు ఒకర్ని ప్రేమించి, తరవాత డబ్బు కోసం, పెద్దవారి కోసం మరొకర్ని పెళ్ళిచేసుకుని, ఆనక మొదట ప్రేమించిన అమ్మాయితో కాపురం సాగించే వారి గురించి, అటు ప్రేమికురాల్ని, ఇటు భార్యను చేరదీసే ప్రబుద్ధుల గురించి ఎన్నో కథలు, కబుర్లు విని ఉన్న నేను మీ సంగతి తెలియగానే చాలా అసహ్యించుకున్నాను.

"పెళ్ళి కాకపోతే ఫరవాలేదు. కాని, అటువంటి గుణహీనుణ్ణి, చపలత్వం గల వాడిని చస్తే చేసుకోను అని ఖచ్చితంగా చెప్పేశాను నాన్నతో.

"కాని, దురదృష్టవంతుల్ని బాగు చేసే దెవరు?

ఏ కారణంచేత మిమ్మల్ని తిరస్కరించావో అటువంటి వ్యసనాల కన్నిటికీ నా భర్త బానిస అని ఆ తరవాత తెలుసుకుని నాలో నేనే కుమిలి పోయాను. తాగుడు మైకంలో ఆయనా, ఆయన ఫ్రెండూ స్కూటర్ మీద వస్తూ ఏక్సిడెంటుకు గురి అయినారు. ఏ క్షణంలో ఏ ఆపద ముంచుకు వస్తుందో ఎవరూ చెప్పలేరు కదా? ఆయన ఇక లేరు, ఇక రారు. కాని, వంటపిల్ల వాడితో నేను ఏకాకిగా మిగిలి పోయాను. నా కంటూ ఒక వ్యాపకం ఉంటే మంచిది కదా? అందుకే ఉద్యోగాన్వేషణకు బయలు దేరాము. 'అడుగు లోనే హంసపాదు' అన్నట్లు మీరు కనిపించారు. మీ కళ్ళలో ప్రతిఫలించే కోపాన్ని అవగాహన చేసుకున్నాను. అందుకే మీ దగ్గర మాత్రం చేయి చాపకూడదని నిర్ణయించుకున్నాను. నన్ను మన్నించండి. మీకు ఏమీ కాని... ఒక అభాగ్యురాలు." ★


# దేనా బ్యాంకులో మీ డబ్బుని కాలం ఎలా తెలుసుకుంటే మారుస్తుందో ఆశ్చర్యపడతారిక-



**సమృద్ధి డిపాజిట్ పథకం**
మీరు పొదుపుచేసినది అమోఘమైన వేగంతో పెరుగుతుంది, ఎందుకంటే మీ అసలుతో బాటే మీ వడ్డీకూడా వడ్డీని ఆర్జించి పెడుతుంది గనక. రు. 100 విభాగాల్లో 12 నుంచి 120 నెలల కాలపరిమితిలో పెట్టుబడి పెట్టండి.

**రికరింగ్ డిపాజిట్ స్కీమ్**
(పునరావృత్తి డిపాజిట్ పథకం) నెలవారీగా పొదుపు చేసే సొమ్మును భవిష్యత్తులో పెద్ద ఎత్తులో పెట్టుబడిగా మార్చుకోండి. మీరు ఎంత పొదుపు చెయ్యాలను కున్నారో ఎంచుకోండి. రు. 5 నుంచి రు. 500 దాకా. కాలపరిమితిని ఎంచుకోండి. 12 నుంచి 120 నెలలు.

**ఫిక్సెడ్ డిపాజిట్లు**
మీరు వీలుగా పక్కన వెయ్యగల సొమ్ముకు అమోఘమైన లాభాలు. ఎక్కువ కాలపరిమితిలో మీ డబ్బును డిపాజిట్ చేసి మరింత ఎక్కువ వడ్డీని ఆర్జించండి.

**క్యాష్ సర్టిఫికేట్లు**
రావంతట అవే పెరిగిపోయే భద్రతగల పెట్టుబడి. ఈ సర్టిఫికేట్లు రు. 25, రు. 100, రు. 1,000, రు. 10,000, 50,000 మరియు రు. 1,00,000 ల విభాగాల్లో దొరుకుతాయి.

వివరాలకోసం మీకు దగ్గరలోనున్న దేనా బ్యాంక్ శాఖను సందర్శించండి.

**దేనా బ్యాంక్**
(జాతీయం చేయబడిన-బ్యాంక్)
కేంద్ర కార్యాలయం : మేకర్ టవర్స్ ఈ, కఫ్ పెరేడ్, బొంబాయి 400 005.

ప్రజల ప్రగతి, సౌభాగ్యంకోసం అంకితమైనది.

RATAN BATRA/DB/TEL/312